క్లుప్తంగా

పోలమాంబ ఆలయంలో అన్నదానం నేడు

తగరపువలస: వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం సంగివలస పోలమాంబ ఆలయం ఆవరణలో అన్నదానం నిర్వహించనున్నట్టు ఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అందించే అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరణకు భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

ముగిసిన మరిడమ్మతల్లి పండగ



పూజలు అందుకున్న మరిడమ్మతల్లి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పాత పరదేశిపాలెంలో సోమవారం ప్రారంభమైన శ్రీ మరిడమ్మతల్లి మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సాడి రమణ తెలిపారు.

రక్తదానానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారిని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.నివాస్ అభినందించారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఐశ్వర్య లక్ష్మి ఆలయ నిర్మాణ శంకుస్థాపన ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మించనున్న ఐశ్వర్య లక్ష్మి ఆలయ నిర్మాణ శంకుస్థపన, భూమిపూజకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ట్రస్ట్‌బోర్డు సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఇక్కడి శ్రీవారి ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మి అమ్మవారి మందిర నిర్మాణాన్ని చేపట్టనున్నామని తెలిపారు. ఈ నెల 18న భూమిపూజ, శంకుస్థాపన చేసేందుకు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, ఉసిరికల తాతాజీ, అర్చకులు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ కార్నివాల్



విద్యార్థికి సైకిల్ అందిస్తున్న నిర్వాహకులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని గొల్లలపాలెం వద్దనున్న ది సెడార్ స్కూల్‌లో మంగళవారం వినోదాల పండగ (కార్నివాల్) ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు ఏర్పాటు చేశారు. పాఠశాల సీఈవో సెరీనా వివేకా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో స్నేహపూరిత వాతావరణం నెలకొనడంతోపాటు ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల సీడీవో సునీత్ కొమన్ పాల్గొన్నారు.

చారిత్రక సంపద సంరక్షణలో నిర్లక్ష్యం

- కనుమరుగవుతున్న గుడిలోవ చారిత్రక ఆనవాళ్లు
- నిర్లక్ష్యపు నీడలో దేవాలయాల సముదాయం



తుప్పలతో అధ్వానంగా మారిన మెట్ల మార్గం



ఆరుబయట పడి ఉన్న రాతిశాసనాలు



గుడిలోవలో ఉన్న నారాయణేశ్వర ఆలయం

ఆనందపురం : బృహదాచల క్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన మండలంలోని గుడిలోవ దేవాలయాల సముదాయం నిర్లక్ష్యానికి గురవుతోంది. పురాణ ప్రాశస్త్యం, ప్రకృతి రమణీయతలతో అలరారే గుడిలోవ ప్రాంతం రోజురోజుకూ తీసికట్టుగా మారుతోంది. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ఎన్నో అవకాశాలున్నా పట్టించుకునే దాఖలాలు కనిపించడం లేదు. దీంతో అక్కడి చారిత్రక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. పురాణ ప్రాశస్త్యంను తెలియజేసే రాతి కట్టడాలు, శిల్పాలు, శిలా శాసనాలు మట్టిలో కలిసిపోతున్నాయి. తవ్వకాల్లో బయటపడిన విగ్రహాలు ఆలనాపాలనకు నోచుకోలేదు. దీంతో ఈ దుస్థితి చూసి పలువురు ఆధ్యాత్మికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల క్రితం రాజవంశీయులు నిర్మించిన రంగనాథస్వామి, నారాయణేశ్వర స్వామి ఆలయాల సముదాయం ప్రాంతంలో పూర్వం రుషులు సంచరించే వారని ప్రతీతి. ఈ ఆలయాల్లో దూపదీప నైవేద్యాలు సమర్పించడానికి సుమారు 50 ఎకరాల భూములను రాజవంశీయులు కేటాయించగా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

కానరాని సంరక్షణ చర్యలు

నారాయణేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఆరుబయట రాతి శాసనాలు పడేసి ఉన్నాయి. అందులో కొన్ని ముక్కలయ్యాయి. కొండ తవ్వకాల్లో శివలింగం, వినాయక విగ్రహం, నంది విగ్రహం, దేవతామూర్తుల విగ్రహాలు, శాసనాలు రచించిన రాతి పలకలు మొదలగునవి ఎప్పుడో బయటపడ్డాయి. వాటికి కనీసం రక్షణ కల్పించకుండా ఆరుబయటే విడిచి పెట్టేశారు. దేవాలయానికి చేరుకునేందుకు పూర్వం నిర్మించిన మెట్ల మార్గాన్ని పట్టించుకోకపోవడంతో తుప్పలు, డొంకలు పెరిగి నడవడానికే వీలులేని పరిస్థితిలో ఉంది. శివపాద సన్నిధి నుంచి నిత్యం ప్రవహించే ఆకాశ గంగ ఇక్కడ ప్రత్యేకత. కాగా అక్కడ సరైన సౌకర్యాలు లేక భక్తులు స్నానమాచరించడానికి ఇబ్బందులు పడుతున్నారు. పూర్వకాలంలో కొండ దిగువ ప్రాంతంలో యజ్ఞ యాగాదులు నిర్వహించే వారు అన్నదానికి ఆధారాలు బయటపడ్డాయి. కొండ పైకి రోడ్డు నిర్మించే క్రమంలో తుప్పలు, డొంకలు తొలగించే సమయంలో కొండ దిగువ ప్రాంతంలో రాతి మండపం, పక్కనే నేలబావి బయటపడ్డాయి. మండపం స్తంభాలపైన శాసనాలు లిఖించి ఉన్నాయి. కానీ మండపానికి కూడా రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో గుడిలోవలో వెలుగు చూసిన చారిత్రక ఆనవాళ్లు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు దేవాలయంపై దృష్టి సారించి పూర్వ వైభవం తీసుకురావాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.




నిత్యం ప్రవహించే ఆకాశ గంగ

ట్రస్ట్ సమావేశంలో చర్చించాం

గుడిలోవలో అభివృద్ధి పనులు చేపట్టడంపై ట్రస్ట్ మీటింగ్‌లో చర్చించాం. దేవాదాయ శాఖతో పాటు పంచాయతీ సహకారం కూడా తీసుకోవడానికి నిర్ణయించాం. ఉన్నతాధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– శిరికి నానాజీ, దేవాదాయ శాఖ ఈవో, గుడిలోవ

చిట్టివలసలో 16 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం



ప్రారంభానికి సిద్ధమైన సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం ఆవరణలో 16 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఆలయ ప్రధాన అర్చకుడు ఆకెళ్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో దాతల సహకారంతో విజయనగరానికి చెందిన కళాకారులు ఈ విగ్రహాన్ని రెండు మాసాలుగా తీర్చిదిద్దుతున్నారు. మలేషియాలోని సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని పోలిన విధంగా దీనిని రూపొందిస్తున్నట్టు కళాకారులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి చుట్టుపక్కల ఆధ్యాత్మిక సంస్థలు, భక్తులను ఆహ్వానించనున్నట్టు అర్చకుడు తెలిపారు.

వినియోగించని స్తంభాలు తొలగించండి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



ఎండాడ చెరువును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, అధికారులు

కొమ్మాది: వినియోగించని కేబుల్ వైర్లు, ఎలక్ట్రికల్ స్తంభాలను తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఎండాడ జంక్షన్ నుంచి రుషికొండ ఐటీ సెజ్ వరకు అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జి – 20 సదస్సుకు దేశ విదేశాల నుంచి అతిథులు వస్తున్నందున వారికి అసౌకర్యం కలగకుండా విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దాలని, అందుకు రోడ్లు, జీబ్రా క్రాసింగ్ లైన్స్, పారిశుధ్యం, విద్యుత్ అలంకరణ, పచ్చదనం, ఫుట్‌పాత్‌ల నిర్మాణంలాంటి పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అనధికార ప్రకటన బోర్డులు, ఆక్రమణలు తొలగించాలని, వేలాడే కేబుల్ వైర్లు సక్రమంగా కట్టాలని సూచించారు. ఎండాడ చెరువు మరమ్మతులు చేపట్టి ఫుట్‌పాత్ రెండు వైపులా పెయింటింగ్ వేయించాలని, అదేవిధంగా భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడికక్కడే ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 8వ వార్డు ఎండాడ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ సరిగా లేకపోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐటీ సెజ్ బిల్డింగ్ నుంచి భీమిలి బీచ్ కలిసే రోడ్డు పాడైనందున వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ వి.సన్యాశిరావు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి బి.సురేష్ కుమార్, డీడీ ఎమ్.దామోదరరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టికెట్ల కోసం క్రీడాభిమానుల కోలాహలం



టికెట్ల కోసం స్టేడియం వద్ద బారులు తీరిన క్రీడాభిమానులు




క్యూలో నిరీక్షిస్తున్న క్రీడాభిమానులు

- పోలీస్ బందోబస్తు మధ్య విక్రయాలు

పీఎం పాలెం: మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల 19న జరగనున్న ఒక్కరోజు డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ టికెట్లను స్టేడియం వద్ద మంగళవారం విక్రయించారు. వీటి కోసం క్రికెట్ క్రీడాభిమానులతో స్టేడియం పరిసరాలన్నీ నిండిపోయాయి. మునుపెన్నడూ లేనంతగా టికెట్ల కోసం అభిమానులు పోటీపడ్డారు. సోమవారం రాత్రి నుంచే క్రీడాభిమానులు స్టేడియం పరిసరాల్లో క్యూ కట్టారు. ట్రాఫిక్ ఏసీపీ భీమారావు పర్యవేక్షణలో సీఐ సాయి టికెట్లు విక్రయించే కౌంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

కానూరి మృతికి సంతాపం



కానూరి సూర్యనారాయణ (ఫైల్)

తగరపువలస: భీమిలి డివిజన్ సీపీఐ సీనియర్ నాయకుడు కానూరి సూర్యనారాయణ వృద్ధాప్యం కారణంగా అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వర్తించిన సూర్యనారాయణ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారు. ఆయన భౌతికకాయానికి స్థానిక నాయకులు అల్లు బాబూ రావు, కానూరు రాంబాబు, దుంప శ్రీనివాస రావు, మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, నూలు ఆది నారాయణ, పెంటపల్లి బాబూ రావు, మంగా శివప్రసాద్ జల్లు సూర్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

ఫీవర్ సర్వే ప్రారంభం

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2లోని వివిధ ప్రాంతాల్లో గల పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో మంగళవారం ఫీవర్ సర్వే ప్రారంభమయ్యింది. హెచ్3ఎన్2 వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో వలంటీర్లు, ఆశ, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే చేపడుతున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి సచివాలయ క్లస్టర్ పరిధిలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారని, జ్వరాలున్న వారిని గుర్తించి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో చికిత్స అందిస్తామని చెప్పారు.

జైలు ఆవరణలో జిమ్ పరికరాలు ఏర్పాటు

ఆరిలోవ: సింబయాసిస్ కంపెనీ అధినేత ఒ.నరేష్‌కుమార్ సహకారంతో విశాఖ కేంద్ర కారాగారం ఆవరణలోని ఉద్యోగుల క్వార్టర్స్‌లో జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. వీటిని జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ సింబయాసిస్ అధినేతతో కలసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. పరికరాలు ఏర్పాటు చేసిన నరేష్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, అధికారులు పాల్గొన్నారు.

కాలువలపై పలకలు శిథిలం



ఆనందపురం పశువుల ఆస్పత్రికి సమీపంలో పగిలిపోయిన పలక



గుడిలోవకు సమీపంలో శిథిలమైన కాలువ

- ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు

ఆనందపురం : మండలంలోని గండిగుండం నుంచి పెద్దిపాలెం వరకూ ఆరు లైన్ల రహదారికి ఇరువైపులా నిర్మించిన కాలువలపై పలకలు కొద్ది కాలంలోనే శిథిలమైయాయి. దీంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆరు లైన్ల రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లకు అనుసంధానంగా కాలువలను నిర్మించారు. వాటిపై సిమెంట్ పలకలను మూతలుగా ఏర్పాటు చేశారు. వాటిని పాదచారులు నడవడానికి వినియోగించుకోవడానికి వీలుగా తయారు చేశారు. దీంతో సర్వీసు రోడ్డులో పాదచారుల రాకపోకలకు అనువుగా మారాయి. కాగా కాలువలపై అమర్చిన పలకలు నాసిరకంగా ఉండడంతో చాలా చోట్ల పగిలిపోయాయి. కౌంత్యాం, గండిగుండం, తర్లువాడ, పెద్దిపాలెం, వెల్లంకి, వేములవలస తదితర ప్రాంతాల్లో పలకలు పగిలిపోయి కాలువలోనే పడిపోతున్నాయి. దీంతో రాత్రి వేళ ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే రోడ్డుపై వరద నీరు కాలువల గుండా ప్రవహించాల్సి ఉండగా... కాలువలు చాలా చోట్ల మూసుకుపోవడంతో వర్షాలు పడితే లోతట్టుగా ఉండే దుక్కవానిపాలెం, మెట్టమీదపాలెం, వెల్లంకి, కౌంత్యాం తదితర ప్రాంతాల్లో భారీగా నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలపై పలకలు సరిచేసి, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యానికి రక్ష



రాయపాలెంలో నులి పురుగుల నివారణపై ప్రచారం చేస్తున్న భీమిలి ఎంఈవో బాలామణి



బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినికి మాత్రలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది



పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినికి మాత్ర వేస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో శివరాణి



భీమిలి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మాత్రలు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సింహాచలం

తగరపువలస: చిన్నారుల్లో నులి పురుగులను నివారించడం ద్వారానే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని భీమిలి ఎంఈవో కేపీ బాలామణి అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్స వం సందర్భంగా రాయపాలెం జీవీఎంసీ హైస్కూల్ లో విద్యార్థులకు అవగాహన కల్పించి మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసానికి నులి పురుగుల నివారణ మాత్రలు పనిచేస్తాయన్నారు. ఆరుబయట జాగ్రత్తలు తీసుకోకుండా విక్రయించే తినుబండారాల వల్ల పొట్టలో నులి పురుగులు చేరి పిల్లల శక్తిని హరిస్తాయన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

➡ ఒకటో వార్డు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి పాల్గొన్నారు.

➡ భీమిలి మండలంలోని తాళ్లవలస పీహెచ్‌సీ పరిధిలో 95 శాతం (13 వేల మంది) మంది చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందించినట్టు పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు తెలిపారు. ఈ నెల 18న మిగిలిన చిన్నారులకు మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు.

పద్మనాభం: నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌చార్జి ఎంఈవో ఎం.శివరాణి అన్నారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం విద్యార్థులతో నులి పురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా శివరాణి మాట్లాడారు. ప్రోగ్రాం అధికారి రామిరెడ్డి, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న, ఎస్‌వో గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

భీమునిపట్నం: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇక్కడి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు అందించారు. ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాస్, నయీం, సుజాతాకుమారి, రామకృష్ణ, వెంకటరావు పాల్గొన్నారు.

➡ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. అధ్యాపకులు డాక్టర్ సీహెచ్.జ్యోతి, డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, డి.మాధురి, బి.సహదేవుడు పాల్గొన్నారు.

నులి పురుగులు నిర్మూలిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

కొమ్మాది: పిల్లల్లో నులి పురుగులను పూర్తిగా నిర్మూలిస్తేనే వారు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.సరిత అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ దరి వాడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. మహిళా పోలీస్ ప్రియాంక, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్యామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న వైద్యాధికారి

మధురవాడ: మధురవాడ ఎంపీపీ స్కూల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.ప్రశాంతి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 58, 390 మందికి మాత్రలు వేస్తున్నట్టు చెప్పారు. సీహెచ్‌వో ఎమ్.సౌభాగ్యమణి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 18 వేల మంది పిల్లలకుగాను 17,022 మందితో నులి పురుగుల నివారణ మాత్రలు మంగళవారం మింగించినట్టు ప్రోగ్రాం అధికారి రామిరెడ్డి, అనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శైలజ తెలిపారు. డాక్టర్ శాహనాజ్, హెల్త్ సూపర్‌వైజర్లు గోవిందరావు, శ్రీధర్, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లో దేశ భవిత



ఏయూ ప్రొఫెసర్ మధుసూదనరావుకు జ్ఞాపిక బహూకరిస్తున్న కళాశాల చైర్మన్ నరసింగరావు

తగరపువలస: విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.మధుసూదనరావు అన్నారు. చిట్టివలస శ్రీకృష్ణ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడే ప్రణాళికలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ బి.నరసింగరావు మాట్లాడుతూ విద్యార్థులంతా వనరులు వినియోగించుకుని అందరికీ మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరూర్ వైశ్యా బ్యాంకు స్థానిక మేనేజర్ సాయిరాం, అసిస్టెంట్ మేనేజర్ రాజేంద్ర, ప్రిన్సిపాళ్లు సతీష్‌కుమార్, కె.చిట్టిరెడ్డి, సింహాచలం, రాజేష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా హైవే దాటుతున్న ప్రయాణికులు

- జాతీయ రహదారిపై జీబ్రా లైన్స్ ఏర్పాటుకు వినతి



బస్టాపు వద్ద హైవేపై రోడ్డు దాటుతున్న ప్రయాణికులు

మధురవాడ: బస్సుల్లో ప్రయాణించేందుకు వందలాది మంది నిత్యం ప్రమాదకరంగా జాతీయ రహదారిని దాటుతున్నారు. కార్‌షెడ్, కొమ్మాది, మధురవాడ కూడళ్లు నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటాయి. ఇక్కడి నుంచి రోజూ వేలాది మంది ప్రయాణిస్తూ ఉంటారు. మధురవాడ వైపు వెళ్లే బస్టాప్, కొమ్మాది, మధురవాడ బస్టాప్ మరింత రద్దీ ఉంటాయి. కార్‌షెడ్ వద్ద బస్టాపును ఇటీవల అధికారులు జాతర సమీపంలోకి మార్పు చేశారు. ఇక్కడ కార్‌షెడ్ పరిసర ప్రాంతాల వాసులతోపాటు మిథిలాపురి వుడా కాలనీ, చంద్రంపాలెం, దుర్గానగర్, సాయిప్రియ గార్డెన్ పరిసర ప్రాంతాల ప్రజలు మధురవాడ వైపు వెళ్లే బస్సులు ఇక్కడే ఎక్కాల్సి ఉంటుంది. బస్సు ఎక్కి, దిగి వుడా కాలనీ, చంద్రంపాలెం వైపు వెళ్లడానికి వందలాది మంది నిత్యం జాతీయ రహదారిని దాటాల్సి ఉంటుంది. ఇక్కడ హైవేపై రెండు వైపులా బస్టాప్ ఉన్నట్టు ఇండికేషన్ బోర్డులు లేవు. సిగ్నల్‌కి ఈ బస్టాప్ చేరువలో ఉండడంతో దానిని దాటడానికి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొమ్మాది జంక్షన్, మధురవాడ బస్టాప్ వద్ద కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. వాహనాలు వేగంగా వచ్చేటప్పుడు స్థానికులు హైవేను దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి హైవేపై జీబ్రా లైన్స్, బస్టాప్ ఉన్నట్టు ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి ఆస్కారం ఉన్నందున చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీగోవత్స రామాయణం పుస్తకావిష్కరణ

ఎంవీపీ కాలనీ: శ్రీగోవత్స రామాయణం గేయ పద్యరూప పుస్తకాన్ని రచయిత్రి మంథా సత్యప్రభ మంగళవారం ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని కార్యాలయంలో ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయణం అనేక మంది కవులు రచించిన సుమధుర కావ్యమన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించే గొప్ప కావ్యంగా ఇది నిలిచిందన్నారు. అనేక రూపాల్లో అందుబాటులో ఉన్న రామాయణాన్ని శ్రీగోవత్స రామాయణంగా గేయ పద్య రూపంలో తాను రచించినట్టు ఆమె తెలిపారు. ఈ పద్యాలు పిల్లలు, పెద్దల్లో విజ్ఞానాన్ని, మంచి నడవడికను పెంచేలా ఉంటాయన్నారు. ఈ పుస్తకం ఆన్‌లైన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. మంథా గోపాలకృష్ణ, శివ సూర్యప్రతాప్, హరవంశీకృష్ణ పాల్గొన్నారు.